వైభవంగా బోనాల జాతర



నస్పూర్‌లో పోతరాజుల విన్యాసాలు

నస్పూర్, ఆగస్టు 4: ఆది పరాశక్తి భువనేశ్వరి మాత ఆలయం ఆషాఢ బోనాల జాతర ఆదివారం వైభవంగా జరిగింది. సీసీసీ కార్నర్ వద్దకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఇక్కడి నుంచి రాంనగర్‌లోని ఆదిపరా శక్తి భువనేశ్వరి మాత ఆలయం వరకు డప్పు చప్పుళ్ళ నడుమ పోతరాజుల విన్యాసాలు, శివ సత్తుల పూనకాలు, మహిళల కోలాటాల మధ్య బోనాల ఊరేగింపు కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు, ఆషాఢ బోనాల జాతర నిర్వహకులు వంగల దయానంద్, వివేకానంద్‌ల ఆధ్వర్యంలో జాతర జరిగింది. సీసీసీ కార్నర్ నుంచి ఆలయం వరకు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కాల్వ సుజాత గుప్త, మున్సిపల్ ఛైర్మన్ సుర్మిళ్ళ వేణు తదితరులు బోనాల ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. ఆషాఢంలో చివరి ఆదివారం కావడంతో బోనాల జాతరలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

యువత వ్యసనాల బారిన పడొద్దు

నస్పూర్, ఆగస్టు 4: యువత వ్యసనాల బారిన పడిజీవితాలను నాశనం చేసుకోవద్దని మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ అన్నారు. సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తూ పట్టుబడిన యువకులకు ఆదివారం స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు, విద్యార్థులు ఇతరాత్ర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయికి బానిసలై గొడవలు, కేసులతో తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. మత్తుకు బానిస కావడం వల్ల రోజురోజుకు ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. మత్తుకు దూరంగా ఉంటూ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని సీఐ సూచించారు. గంజాయి అమ్మకాలు, సరఫరాపై పోలీస్‌శాఖ నిరంతరం నిఘా పెట్టిందని, గం జాయి సరఫరా చేసినా, అమ్మిన వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలన్నారు. గంజా యి వినియోగించిన వారిని పరీక్షించడానికి టెస్టింగ్ కిట్లు వచ్చాయని, దాని ద్వారా నిర్ధారణ చేయవచ్చని తెలిపారు. సమావేశంలో ఎస్సై నెల్కి సుగుణాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి


దండేపల్లి,ఆగస్టు 4: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి డిమాండ్ చేశారు. దండేపల్లిలో ఆదివారం పద్మశాలి సంఘం భవనంలో నిర్వహించి మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా మోసం చేస్తోందని మండిపడ్డారు. మహిళలకు నెలకు 2,500 రూపాయలు, నిరుద్యోగులకు 4వేలు, రైతు భరోసా పేరుతో సాగు చేస్తున్న ప్రతిఎకరాకు రైతు భోరోసా కింద వానాకాలం, యాసంగి కలుపుకోని 15వేల రూపాయలు అందజేయాలన్నారు. కౌలురైతులకు ఏడాదికి 15వేల రూపాయలు చెల్లించాలన్నారు. వ్యవసాయ కూలీలందరికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏడాది 12వేలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన మంత్రి పంటల బీమా యోజనను అమలు చేయాలని చెప్పారు. వంద రోజుల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామన్న ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజల సమస్యల పరిష్కరం కోసం ప్రశ్నిస్తే బీజేపీ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తాము ఎల్లవేళలా పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు రాజన్న, రవిగౌడ్, శ్రీనివాస్, మాజీ ఎంపీపీ గురువయ్య, మండల ఇన్‌చార్జి ప్రభాకర్, నాయకులు శ్రీనివాస్, నరేష్, రాకేష్, శ్రీదేవి, సుగుణ, దివ్య, మంజుల, కిషన్, అశోక్, సత్యనారయణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

స్వలాభం కోసం వాడుకోవద్దు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 4: మాజీ సైనికులను రాజకీయ పార్టీ నాయకులు స్వలాభం కోసం వాడుకోవద్దని మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు బాల్నే భాస్కర్, ఉపాధ్యక్షులు సత్యనారాయణలు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి వి.రవి, కోశాధికారి డీబీ చారి, సభ్యులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ల కబ్జా

- మున్సిపాలిటీల్లో విచ్చలవిడిగా ఆక్రమణలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- ఎక్కడికక్కడ దుకాణదారుల స్వాధీనం
- చిరు వ్యాపారుల వద్ద వేలల్లో అద్దె వసూలు
- జిల్లా వ్యాప్తంగా పట్టణాల్లో ఇదే తీరు



అర్చనటెక్స్ చౌరస్తాలో రోడ్డుపై ఏర్పాటు చేసిన స్టాల్స్

ఏసీసీ, ఆగస్టు 4: పాద చారుల భద్రతతో పాటు సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంతో పాటు బెల్లంపల్లి, లక్సెట్టిపేట, తదితర మున్సిపాలిటీల్లో ఇదే తీరున కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వాహన దారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రభుత్వం ఫుట్‌పాత్‌లను నిర్మించింది. వాటి కోసం లక్షల రూపాయలు కేటాయించింది. ప్రస్తుతం వాటిని దుకాణదారులు కబ్జా చేస్తున్నారు. చిరు వ్యాపారులు రోడ్డుపైనే విక్రయాలు కొనసాగిస్తుండడంతో విని యోగదారులు తాము వచ్చిన వాహనాలు అక్కడే నిలిపి ఉంచుతున్నారు. దీంతో ఆ రోడ్డుపై వెళ్లేందుకు వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు.

మంచిర్యాల జిల్లా కేంద్రంలో షాపిం గ్‌మాల్స్, దుకాణ సముదాయాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని పట్టణాల్లో షాపింగ్ చేసేందుకు , వివిధ వస్తువుల కొను గోలుకు నిత్యం ప్రజలు పెద్ద ఎత్తున మారు మూల పల్లెల నుంచి పట్టణాలకు వస్తుంటారు. బట్టలు, ఫ్యాన్సీ వస్తువులు, ఆభరణాలు, ఎలక్ట్రాని క్ పరికరాలు, కిరాణం సామగ్రి, ఎలక్ట్రికల్ వస్తువులు, పాదరక్షలు, గృహోపకరణాలు, ప్లంబింగ్, ఫర్నిచర్, హార్డ్‌వేర్ షాపులు, ఐరన్, రాడ్డు, సిమెంటు, శానిటరీ, స్టీల్ సామగ్రి షాపుల్లో నిత్యం పెద్ద ఎత్తున వ్యాపారం జరుగుతోంది. దుకా ణాల యజమానులు వాటి ముందు రోడ్లను ఆనుకుని చిరు వ్యాపారులు వారి వ్యాపారులు నిర్వహించు కునే బండ్లు, స్టాళ్లను, స్టాండ్‌లను ఏర్పాటు చేసుకోవడానికి స్థలాలను అద్దెకిస్తున్నారు.

చిరు వ్యాపారులు షాపుల ఎదురుగా ఉన్న స్థలంలో బండ్లు, స్టాళ్లను ఏర్పాటు చేసుకుని అమ్మకాలు చేస్తున్నందుకు నెలనెలా షాపుల నిర్వహకులకు వేల రూపాయలు అద్దె చెల్లిస్తున్నారు. వాస్తవానికి షాపుల ముందు రోడ్లను ఆనుకుని ఉన్న స్థలంపై ఆయా భవనాల యజమానులకు కానీ షాపుల నిర్వాహకులకు కానీ ఎలాంటి హక్కులు ఉండవు. భవన నిర్మాణ సమయంలో మున్సిపాలిటీల నుంచి పర్మిషన్ పొందేటప్పుడు ఆ స్థలాన్ని సెట్‌బ్యా క్‌గా వదిలేస్తామని ప్లాన్‌లో చూపిస్తారు. అలా వదిలేసిన స్థలంలో భవనాల యాజమానులు మెట్లను, గద్దెలను నిర్మించి వాటితో పాటు షాపుల ముందు రోడ్డు స్థలాన్ని చిరు వ్యాపారులకు అద్దెకిస్తున్నారు.

ప్రచార హోర్డింగులు..



ఫుట్‌పాత్‌లపై స్టాల్స్

జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డులో వస్త్ర, ఆభరణాల దుకాణాలు, షాపింగ్‌మాళ్ల నిర్వాహకులు బయట రోడ్డును ఆనుకుని ప్రచార హోర్డింగులు, కటౌట్‌లు రోడ్లపైకి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాటు షాపుల ముందు రోడ్లను ఆనుకుని కొబ్బరి బొండాలు, టీస్టాల్లు, జ్యూస్ , ఐస్‌క్రీమ్, పాప్‌కార్న్, మిర్చీ, కారా, చాట్, ఫాస్ట్‌ఫుడ్ తదితర స్టాళ్లను ఏర్పాటు చేసి విక్రయాలు చేపట్టడం, అవి తినేందుకు వచ్చే ప్రజలు కూర్చోవడానికి రోడ్లపై ప్లాస్టిక్ స్టూళ్లను వేయడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జిల్లా కేంద్రంలోని అర్చనటెక్స్ చౌరస్తా నుంచి మొదలుకుని మార్కెట్ రోడ్డు పొడవునా, బెల్లంపల్లి చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు రోడ్లకిరువైపులా షాపుల యాజమానుల చిరు వ్యాపారులు నెలకు రూ. 6 వేల నుంచి 10 వేల వరకు వసూలు చేస్తున్నారు. చిరు వ్యాపారులకు విద్యుత్ సరఫరా కల్పించినట్లయితే కరెంటు బిల్లు అదనంగా తీసుకుంటున్నారు. జిల్లా కేంద్రంతో పాటు జి ల్లాలోని బెల్లంపల్లి, మందమర్రి, నస్పూర్, రామకృష్ణాపూర్, చెన్నూరు, లక్సెట్టిపేట పట్టణాల్లోని మార్కెట్ ఏరియాల్లో పెద్ద షాపులు, షాపింగ్ కాంప్లెక్స్‌ల వద్ద ఇదే తంతు నడుస్తోంది. అంతేకాకుండా నేషనల్ హైవేను ఆనుకుని తాండూర్, బెల్లంపల్లి, మందమర్రి, నస్పూర్, శ్రీరాంపూర్‌లలోని కొన్ని ప్రాంతాల్లో కూడా షాపు లయాజమానులు చిరు వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున అద్దెలు వసూలు చేస్తున్నారు.

వాహనదారుల అవస్థలు..

ఫుట్‌పాత్ ఆక్రమించి చిరు వ్యాపారులకు దుకాణదారులు అద్దెకు ఇవ్వడంతో రోడ్లపై వివిధ స్టాల్లు ఏర్పాటు చేయడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందినప్పుడు మాత్రమే మున్సిపల్ అధికారులు మొక్కుబడిగా కొన్ని షాపుల ముందు స్టాళ్లను తొలగించడం పరి పాటిగా మారింది. మళ్లీ కొద్ది రజులకే తొలగించిన చోటనే స్టాళ్లను తిరిగి ఏర్పాటు చేసినా చర్యలు తీసుకోవడం లేదు. రాజకీయ జోక్యం కూడా అధికారులు శాశ్వత చర్యలు తీసుకోకుండా వెనకడుగు వేయడానికి మరో కారణం అవుతుందని చెబుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఫుట్‌పాత్ దందా కొనసాగుతున్నా అధికారులకు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. బతుకు దెరువు కోసం చిరు వ్యాపారాలు చేసుకునే వారు రోడ్లను ఆనుకుని స్టాళ్లను ఏర్పాటు చేసుకుంటే వారి నుంచి దుకాణ దారులు బెక్కుపిండి అద్దె వసూలు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో దుకాణదారులు చిరు వ్యాపారుల నుంచి వసూలు చేసే అద్దెలు వారు బిల్డింగ్ యాజమానులకు చెల్లించే అద్దెలతో సమానంగా ఉండడం గమనార్హం. చిరు వ్యాపారులు వారికి మిగిలేదానిలో ఎక్కువ మొత్తం అద్దె రూపంలో చెల్లించాల్సి రావడంతో కుటుంబాల పోషణకు ఇక్కట్లు పడాల్సి వస్తోంది. మున్సిపాలిటీలో షాపుల నిర్వహకుల నుంచి మాత్రమే పన్నులు వసూలు చేస్తున్నారు. చిరు వ్యాపారులపై ఎలాంటి పన్నులు విధించడం లేదు. ఫుట్‌పాత్ వ్యాపారం వల్ల కేవలం దుకాణదారులు, భవనాల యాజమానులకు మాత్రమే భారీగా ఆదాయం సమకూరుతోంది. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మంచిర్యాల మార్కెట్‌లో వాహనదారుల అవస్థలు

క్యాతన్‌పల్లి అభివృద్ధికి కృషి

- చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

రామకృష్ణాపూర్, ఆగస్టు 4: చెన్నూరు నియోజకవర్గంలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ అభివృ ద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. మున్సిపల్ పరిధిలోని రెండో వార్డులో ఆదివారం 30లక్షల మున్సిపల్ నిధులతో జ్యోతినగర్, అమరవీరుల స్తూపం పక్కన గల వరద నీటి కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్, సంక్షేమ పథకాల విషయంలో పారదర్శకంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేప ట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జంగం కల, వైస్‌ఛైర్మన్ సాగర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మురళి కృష్ణ, మున్సిపల్ ఏఈ అచ్యుత్, ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్, వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రె డ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య, మాజీ ఎంపీటీసీ ఫుల్లూరి కళ్యాణ్, నాయకులు అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

● ఖజానా ఖాళీ చేసిన బీఆర్ఎస్

మందమర్రిటౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం ఖజానాను పూర్తిగా ఖాళీ చేసిందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. గాంధారి మైసమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫ్రెండిషిప్ కేక్‌ను కట్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ధనిక రాష్ట్రమని చెప్పిన బీఆర్ఎస్‌పార్టీ అప్పుల ఊబిలోకి నెట్టివేసిందన్నారు. కేసీఆర్‌కుటుంబ ప్రయోజనాలు తప్ప ప్రజా ప్రయోజనాలు పట్టించుకోలేదని విమర్శించారు.. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందు తుందని తెలిపారు. చెన్నూరు, క్యాతనపల్లి, మందమర్రి మున్సిపాలిటీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ విప్ నల్లాల ఓదెలు, నాయకులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేను కలిసిన జీఎం

చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిని మందమర్రి జీఎం మనోహర్ ఆదివారం కలిశారు. మందమర్రి, రామకృష్ణపూర్ పట్టణాల అభివృద్ధికి సింగరేణి సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.

కరపత్రాల ఆవిష్కరణ

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 4: సిద్దిపేటలో ఈ నెల 17,18,19 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతుల కరపత్రాలను ఆదివారం జల్లా కేంద్రంలో పీడీఎస్‌యూ నాయకులు విడుదల చేశారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శ్రీకాంత్, సిద్దార్థ, చరణ్, అన్వేష్, మనోహర్, మహేష్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

హాజీపూర్, ఆగస్టు 4: మండలంలోని నంనూరు గ్రామం నుంచి మాజీ వార్డు సభ్యులు సురేందర్, తిరుపతి, లక్ష్మణ్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీలో చేరారు. కార్యక్రమంలో కృష్ణ మూర్తి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఏఈఈ ఉద్యోగానికి ఎంపిక

కోటపల్లి, ఆగస్టు 4: మండలంలోని రొయ్యలపల్లి గ్రామానికి చెందిన రావుల గంగరాజు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలో ఏఈఈగా ఎంపికయ్యారు. రెండు రోజుల క్రితం విడుదల చేసిన ఫలితాల్లో గంగరాజు ఇంజనీర్‌గా ఎంపికయ్యారు. నిరుపేద కుటుంబానికి చెందిన దుర్గం లచ్చయ్య-మైసక్కల కుమారుడైన గంగరాజు ప్రాథమిక విద్యను రొయ్యలపల్లిలో పూర్తి చేశాడు. 6 నుంచి 10వ తరగతి వరకు ఇందారంలోని గురుకుల పాఠశాలలో ఇంటర్ ఆసిఫాబాద్ గురుకుల పాఠశాలలో చదివాడు. అనంతరంన గంగరాజు గ్రూప్ 1, 4 క్వాలిఫై కాగా ప్రస్తుతం ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

90 గ్రాముల గంజాయి పట్టివేత

బెల్లంపల్లి, ఆగస్టు 4: మండలంలోని బట్వాన్‌పల్లి గ్రామంలో ఆదివారం 90 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు తాళ్లగురిజాల పోలీసులు తెలిపారు. బట్వాన్‌పల్లి గ్రామ సమీపంలో పెట్రోలింగ్ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న ఇద్దరు యువ కులను పట్టుకుని తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు లభించాయని చెప్పారు. వారిని విచారించగా బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన సంపత్, గణేశ్‌లని , వీరు అభి అనే వ్యక్తి వద్ద గంజాయి ప్యాకెట్లు కొని తీసుకువెళ్తుండగా పట్టుకున్నామని తెలిపారు. నిందితులు సంపత్, గణేశ్ నుంచి 90 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి విలువ సుమారు 2,250 రూపాయలు ఉంటుందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కనువిందు చేస్తున్న జలపాతం



జలపాతం వద్ద యువకుల సందడి

మందమర్రిరూరల్, ఆగస్టు 4: మండలంలోని అందుగులపేట గ్రామ శివారులోని క్షీర జల పాతం కనువిందు చేస్తోంది. యేటా వర్షాకాలంలో కొండపై నుంచి జాలు వారుతూ పడుతున్న నీటి అందాలు కనువిందు చేస్తున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో జలపాతం జాలువారుతోంది. దీంతో ఆదివారం సోమగూడెం, మందమర్రి, మంచిర్యాల, గుడిపేట, తదితర ప్రాంతాల నుంచి యువకులు తరలి వచ్చి జలపాతం అందాలను వీక్షించారు. అందుగులపేట బస్టాప్ నుంచి ఐదు కిలోమీటర్లదూరంలో గల అటవీ ప్రాంతంలో ఈక్షీర జలపాతం ఉంది. సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో జలపాతం వద్దకు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు.

ముందంజలో ఆర్‌కే 5 గని

- బొగ్గు ఉత్పత్తిలో వందశాతం
- స్వచ్ఛ పక్వాడలో మొదటి స్థానం
- అధికారుల ప్రత్యేక పర్యవేక్షణ



అవార్డు తీసుకుంటున్న సింగరేణి డైరెక్టర్, మేనేజర్(ఫైల్)

శ్రీరాంపూర్, ఆగస్టు 4: ఉద్యోగుల సమష్టి కృషి. సరియైన ప్రణాళికతో శ్రీరాంపూర్ లోని ఆర్‌కే 5 గని ముందంజలో ఉంది. ఏ అంశం తీసుకున్నా అందులో నంబర్ 1 స్థానం పొందడం ఆ గని ప్రత్యేకత. అందుకే అన్నింటా రికార్డుల మోత మోగిస్తోంది. ఈ నెల 28న కోల్‌కతాలో జాతీయ అవార్డు రావడంతో సింగరేణి అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్మికులు సంబరాల్లో మునిగితేలుతున్నారు. గతంలో అన్ని గనుల మాదిరిగా ఆర్‌కే5 కూడా సాధారణ గని. తరచూ ప్రమా దాలు జరిగేవి. ఉత్పత్తి సక్రమంగా ఉండేది. ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షణ చేసేవారు. మార్పు కోసం సూచనలు ఇచ్చేవారు. ఈ క్రమంలో నాలుగేళ్లుగా ఉద్యోగులకు ప్రతి అంశంపై అవగాహన కల్పించారు. నిబంధనలు, రక్షణ సూత్రాలను తెలిపే బోర్డులను పనిస్థలాల్లోనే ఏర్పాటు చేశారు. సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ పక్వాడా, ఇలా ఎన్నో అంశాల గురించి నిరంతరం తెలియ జెప్పే వారు. దీంతో మార్పు మొదలైంది. అన్ని పనులు ఒక క్రమ పద్ధతిలో కొనసాగాయి.

● దేశవ్యాప్తంగా..

దేశవ్యాప్తంగా బొగ్గు గనులకు ఇచ్చే అవార్డు ఆర్‌కే 5 గనిని వరించింది. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో గత నెల 28న జాతీయస్థాయి అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. సింగరేణిలోని ఆర్‌కే5 గనికి "కోల్ అండర్ గ్రౌండ్ స్మాల్ కేటగిరి" కింద మైన్ సేఫ్టీ అవా ర్డు-2024 దక్కింది. గత నెల 19న తనిఖీ బృందం వచ్చి ఆర్‌కే 5 గనిని సందర్శించారు. పని పద్ధతులు, రక్షణలో ఉద్యోగులు పాటిస్తున్న ఎస్‌ఓపీ, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. పరిశీలన అనంతరం అవార్డును కమిటీ ప్రకటించింది. ఈ అవార్డును డీజీఎంఎస్(మైనింగ్) ప్రభాత్ కుమార్ చేతుల మీదుగా సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్స్, ప్లానింగ్) జి వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్‌కే 5 గని మేనేజర్ అబ్దుల్ ఖాదిర్‌లు కోల్‌కతాలో అందుకున్నారు.

● డీజీఎంఎస్ అధికారులు..

గతంలో రక్షణ, ఉత్పత్తి, మ్యాన్ పవర్ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిస్తే అవార్డులు వచ్చేవి. కానీ ఈసారి డీజీఎంఎస్ అధికారులు గనిని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. గనిలోపల కొన్ని పనులు సులువుగా చేసేలా ఏర్పాట్లు ఉండడం కమిటీ సభ్యులను ఆకట్టుకుంది. పర్యావరణ హితం కోసం నాటిన మొక్కలు సైతం అలరించాయి. పరిసరాలూ పరిశుభ్రంగా కనిపించాయి. ఉద్యోగులు పాటించాల్సిన రక్షణ చర్యలను బోర్డుల రూపంలో పని ప్రదేశాల్లో ప్రదరిస్తున్నారు. అంతేకాకుండా మూడేళ్లుగా కంపెనీ తీసుకుంటున్న రక్షణ చర్యలను ఎప్పటికప్పుడు డీజీ ఎంఎస్‌కు చేరవేస్తున్నారు. రికార్డులు సైతం సమయానుకూలంగా నిర్వ హించారు. గనిని పరిశీలించిన అనంతరం అన్ని అంశాల్లో వారికి నచ్చింది.

● ఉత్పత్తితో పాటు ఇతర రంగాల్లోనూ..

ఆర్‌కే 5 గనికి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తిలో ఎల్లప్పుడూ ముందంజలో ఉంది. వంద శాతానికి పైగా ఉత్పత్తి సాధిస్తూ 2021, 2022, 2023లో ముందంజలో ఉంది. అలాగే క్వాలిటీ విజిలెన్స్ అవగాహన పక్షోత్సవాల్లో మొదటి స్థానంలో నిలుస్తోంది. 53వ రక్షణ పక్షోత్సవాల్లో సింగరేణి వ్యాప్తంగా 2023లో మొదటి స్థానంలో నిలిచింది. రక్షణ పద్ధతులు పకడ్బందీగా అమలు చేస్తుండగా, గడిచిన మూడేళ్లలో ఆర్‌కే 5 గనిలో ఏడాదికేడాది ప్రమాదాలు తగ్గుతూ వస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణకూ చర్యలు తీసుకుంటున్నారు. గని సమీపంలో సింగరేణి సీఎండీ ఎన్. బలరాం వనం పేరిట 5 వేల మొక్కలు నాటి వాటిని నిత్యం సంరక్షిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి పరిశ్రమలో స్వచ్ఛ పక్వాడా నిర్వహించి, పర్యావరణాన్ని కాపాడాలని ఆదేశాలు జారీ చేయగా, సింగరేణిలో జరిగిన కార్యక్రమంలో ఆర్‌కే 5 గని 2022, 2023 సంవత్సరాలలో మొదటి బహుమతి అందుకుంది. గని పరిసరాలు శుభ్రంగా ఉంచుతూ ఉద్యోగులు ఆదర్శంగా నిలుస్తున్నారు. గని పేరిట ఆర్‌కే 5 ఉద్యోగులు యూట్యూబ్ ఛానల్, ఫేస్ బుక్ పేజీని నిర్వహిస్తున్నారు.

నాలుగేళ్లుగా పర్యవేక్షణ..



నాలుగేళ్లుగా రక్షణ, ఇతర విషయాల్లో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. గనికి చెందిన కార్మికులు, అధికారులు, ఇతర ఉద్యోగులు ఎంతో శ్రమిస్తున్నారు. కార్మిక సంఘాలకు చెందిన నాయకులు సహకరిస్తున్నారు. రక్షణలో మా గని ఎల్లప్పుడు ముందంజలో ఉంటుంది. సంస్థ ఆదేశాల మేరకు ఏ కార్యక్రమాన్ని అయినా విజయవంతం చేసేందుకు కృషి చేస్తాం. రక్షణ విషయంలో జాతీయ అవార్డు రావడం సంతోషంగా ఉంది.

- అబ్దుల్ ఖాదిర్, ఆర్‌కే5 గని మేనేజర్

● పేపర్‌లెస్ కంపెనీగా..

పేపర్‌లెస్ కంపెనీగా ఉండా సింగరేణి యాజమాన్యం గతేడాది నిర్ణయించింది. ఇదులో భాగంగా కంపెనీ ఉద్యోగులకు సంబంధించిన అపాయింట్‌మెంట్, ప్రమోషన్, తదితర ఉద్యోగ వివరాలతో పాటు కుటుంబ సభ్యులకు సంబంధించిన ఫొటోలు, వారి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. ఈ ప్రక్రియలో ఆర్‌కే 5 ఇప్పటికే ఆ పనిని పూర్తి చేసింది. అంతేకాకుండా సంస్థలో ఎలాంటి సర్క్యులర్లు విడుదల అయినా ఈ గనిలో వంద శాతం అమలవుతున్నాయని కార్మికులు చెబుతున్నారు. కాగా గని కార్మికులు యేటా రక్తదానం చేస్తూ అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన వారిని ఆదుకుంటున్నారు. 2023లో రెడ్ క్రాస్ ద్వారా ప్రశంసాపత్రం అందుకున్నారు. వృద్ధులు, దివ్యాం గులకు వివిధ సందర్భాల్లో నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. సింగరేణి పాఠశాలలో చదువుతూ ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్న వారికి ఫీజు, పుస్తకాలు, యూనిఫాంలు అందజేస్తున్నారు. గనికి అవార్డు రావడంపై సింగరేణి సీఎండీ ఎన్.బలరాం, డైరెక్టర్లు శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీరాంపూర్ జీఎంసంజీవరెడ్డి హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆర్‌కే 5 గనిపై సంబరాలు చేసుకుంటున్న కార్మికులు(ఫైల్)

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

WANTED
★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 20k. Phone : 8977639662 / 8977639663
AJH-4211

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్ ప్రకటనలకు సంప్ర : మంచిర్యాల
సెల్ : 99854 11038, 99854 03314
క్లాసిఫైడ్ ప్రకటనలకు సంప్ర : కాగజ్‌నగర్
సెల్ : 99854 08147

ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

కాసిపేట, ఆగస్టు 4: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాతను ఆదివారం హైదదరాబాద్‌లో ఆర్యవైశ్య సంఘం మండల నాయకుడు సత్తయ్య మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.

మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

బెల్లంపల్లి, ఆగస్టు 4: ప్రభుత్వాలు మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయా లని ప్రగతిశీల మహిళ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శి అరుణ అన్నారు. పట్టణంలోని లక్ష్మీ నర్సింహా ఒకేషనల్ జూనియర్ కాలేజీలో సంఘం డివిజన్ 7వ మహా సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ మతాలు, కట్టుబాట్ల పేరుతో మహిళలను వంటింటికే పరిమితం చేస్తున్నారని చెప్పారు. దేశంలో మహిళలపై అత్యా చారాలు, వరకట్న హత్యలు, లైంగిక వేధింపులు జరుగుతూనే ఉన్నాయన్నారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై ఐక్యంగా పోరాటాలు చేయాలన్నారు. ప్రభుత్వాలు స్పందించి మహిళల రక్షణ కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షురాలుగా రాజక్క, ఉపాధ్యక్షులుగా ఓదక్క, ప్రధాన కార్యదర్శిగా కృష్ణవేణి, సహాయ కార్యదర్శిగా ఆఫ్రీన, కోశాధికారిగా ఈశ్వరి, కమిటీ సభ్యులుగా మల్లేశ్వరి, దుర్గ, మధులత, శకుంతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి శ్రీనివాస్ మహిళలు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

నెన్నెల, ఆగస్టు 4: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌పై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన నెన్నెలకు చెందిన పల్ల మహేష్, ముష్కు రామన్నపై శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో వివిధ అభివృద్ధి పనుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి వాట్సాప్ గ్రూపుల్లో పెట్టారని పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మిట్ట కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

జన్నారం, ఆగస్టు 4: రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండ్ విడుదల చేయడంపై హర్షం వ్య క్తం చేస్తూ ఆదివారం మండల కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యంత్రి భట్టి విక్రమార్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు క్షీరాభి షేకం చేశారు. కార్యక్రమంలో సోహెల్సా తదితరులు పాల్గొన్నారు.

'మాజీ ఎమ్మెల్యే తెచ్చిన నిధులతోనే అభివృద్ధి పనులు'

భీమారం, ఆగస్టు 4: భీమారం మండలంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తెచ్చిన నిధులతో ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అభివృద్ధి పనులను చేపడుతున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ అన్నారు. భీమారంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులను తెచ్చి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మధునయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా తరలిస్తున్న ఒకరిపై కేసు

నెన్నెల, ఆగస్టు 4: మండలంలోని పెద్ద లంబాడితండాకు చెందిన ధరవత్ తరుణ్‌పై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఇంట్లో తయారు చేసిన నాటుసారా ప్యాకెట్లను బ్యాగులో పెట్టుకొని అమ్మడానికి బైక్‌పై తీసుకెల్తుండగా గ్రామ శివారులో పట్టుకున్నట్టు చెప్పారు. బైక్‌తో పాటు పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. . ఇక ఫైన వరస దాడులు చేసి పట్టుబడ్డ వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


బైక్‌తో ఢీకొన్న వ్యక్తిపై ఫిర్యాదు

నెన్నెల, ఆగస్టు 4: బైక్‌తో ఢీకొన్న వ్యక్తిపై ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని కుర్మగూడెం వద్ద ఈ నెల 1న జరిగిన రోడ్డు ప్రమాదంలో కోనంపేటకు చెందిన తైదల రమేశ్ గాయాల పాల య్యాడు. తీవ్ర గాయాలు కావడంతో వెంటనే మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతు న్నాడు. భార్య లీనా ఆదివారం నెన్నెల పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. రమేశ్ తన మనుమరాలు కీర్తనతో బెల్లంపల్లికి వెల్లి బైక్‌పై తిరిగి వస్తుండగా ఎదురుగా వచ్చిన మరో వ్యక్తి మోటర్‌సైకిల్‌తో వేగంగా ఢీకొన్నాడు. కిందపడిన రమేశ్ తలకు, కుడి చేయి, కాలికి గాయాలయ్యాయి. ప్రాథమికచికిత్స అందించి మంచిర్యాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి


కాసిపేట, ఆగస్టు 4: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని నిర్వహణ కమిటీ అధ్యక్షుడు మడావి వెంకటేష్ అన్నారు. దేవాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఆదివాసీలు అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నారన్నారు. ప్రభుత్వాలు ఆదివాసీల అభివృద్ధికి ప్రత్యేక నిధులను విడుదల చేసి ఆదివాసీ గూడాలను అభివృద్ధి చేయాలని కోరారు. సమావేశంలో ఆత్ర మహేష్, కుర్సెంగ తిరుపతి, మడావి గోపాల్, మధుకర్, సంగ్ర భూమన్న, ఆడె శ్రీనివాస్, పెంద్రం ప్రభాకర్, ఆత్రం జంగు, పెంద్రం హన్మంతు , వెడ్మ కిషన్, ఆడె జంగు ,మడావి గంగారం పాల్గొన్నారు.
























'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి

- మాల సంఘం జాతీయాధ్యక్షుడు డాక్టర్ పసుల రామ్మూర్తి

ఏసీసీ, ఆగస్టు 4: మాలమహానాడు ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం జాతీయాధ్యక్షుడు డాక్టర్ పసుల రామ్మూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్‌తో కలిసి మాట్లాడారు. సుప్రీం కోర్టు జడ్జిలు ఎస్సీ వర్గీకరణ తీర్పులో తప్పు చేశారన్నారు. ప్రాణాలర్పించైనా ఎస్సీ వర్గీకరణ అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 11, 12న ఢిల్లీలో చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి మాల లు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. సమావేశంలో జాతీయ కార్యదర్శి కాసర్ల యాదగిరి, నాయకులు రాజనర్సు, మధుబాబు, శ్రీనివాస్, తిరపతి పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరకంగా పోరాటం

బెల్లంపల్లి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరకంగా పోరాడుతామని మాల సంఘాల జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఆదివారం బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి కాసర్ల యాదగిరి, నాయకులు సబ్బని రాజనర్సు, గద్దల తిరుపతి, శ్రీనివాస్, మధు బాబు, అమృత, ధనలక్ష్మి, రవళి, పోశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'వర్గీకరణతో ఉపకులాలు అభివృద్ధి'

మందమర్రిటౌన్, ఆగస్టు 4: వర్గీకరణతోనే ఎస్సీ ఉపకులాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ మాతంగి ఓదెలు మాదిగ అన్నారు. స్థానిక మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. ఎస్సీలకు సంబంధించిన ఉమ్మడి రిజర్వేషన్‌లను ఒకటి, రెండు సామాజిక వర్గాలే లబ్ధి పొందుతున్నాయన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పునివ్వడం ఆనందంగా ఉందని, ప్రభుత్వాలు దీన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఆసంపల్లి శ్రీనివాస్,వాసాల సంపత్, ఓదెలు, తిరుపతి, కృష్ణ, శంకర్, కిరణ్, కోటి, శంకర్, తిరుపతి, దాసరి నిర్మల, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అలుపెరుగని పోరాటాల వల్లనే వర్గీకరణ

ఏసీసీ, ఆగస్టు 4 : అలుపెరుగని పోరాటాల ఫలితంగానే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని వికాస్‌నగర్‌లో ఆదివారం మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు సమ్మయ్య, దశరథం, శంకర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సోమగూడెంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జీ కల్వల శరత్ మాదిగ, నాయకులు కొండ్రతిరుపతి , ఉప్పులేటి శ్రీనివాస్, కుక్క రాంచందర్, లంక లక్ష్మణ్, చిలుముల పోశం, బూడిద రమేష్, ఏముర్ల వెంకటేష్, చొప్పదండి కిషన్ తదితరులు పాల్గొన్నారు.





ప్రజా సమస్యలపై నిరంతర పోరు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్

శ్రీరాంపూర్, ఆగస్టు 4 : ప్రజా సమస్యలపై తాము నిరంతర పోరాటం చేస్తామని భారత కమ్యూనిస్ట్ పార్టీ(సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. సీపీఐ నస్పూర్ మండల నిర్మాణ కమిటీ సమావేశం సీసీసీలోని నర్సయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించారు. పార్టీ జెండాను సీనియర్ నాయకుడు అల్ల లచ్చిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం కలవేన శంకర్ మాట్లాడుతూ పార్టీ ఏర్పాటై వందేళ్లవుతోందని, ఆనాటి నుంచి నేటి వరకు ప్రజా సమస్యల పరిష్కారంలో తాము ముందున్నామని తెలిపారు. పార్టీ నిర్మాణానికి కార్యకర్తలు సహకరించాలని కోరారు. అనంతరం నస్పూర్ మండల నూతన నిర్మాణ కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా జోగుల మల్లయ్య, సహాయ కార్యదర్శులుగా లింగం రవి, మొగిలి లక్ష్మణ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎండి. అఫ్రోజ్‌ఖాన్, కోశాధికారిగా మిరియాల రాజేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. అర్హులైన వారికి ఫుడ్ సెక్యూరిటీ కార్డులు, వృద్ధాప్య పింఛన్లు, వితంతు పింఛన్లు ఇవ్వాలని, గృహ జ్యోతి పథకం అమలయ్యేలా చూడాలని ఈ సందర్భంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్, మేకల దాసు, నాయకులు కారుకూరి నగేష్, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి కె. వీరభద్రయ్య శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, నాయకులు దొడ్డిపట్ల రవీందర్, తంగళ్లపల్లి సురేష్, పూజారి రామన్న, కొత్తపెల్లి మహేష్, ఏవిఎన్ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకు పార్టీ శ్రేణులంతా సిద్ధంగా ఉం డాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేన శంకర్ పిలుపునిచ్చారు. రామకృష్ణాపూర్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పార్టీ కార్యకర్తలకు భవిష్యత్ కార్యాచరణపై ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు పౌలు, పెరిక సంపత్, కమలమ్మ, వనం సత్యనారాయణ, వెంకటస్వామి, మెరుగు రాజేషం, నాయకులు సురమల్ల వినయ్, గాండ్ల సంపత్, ఎండి హుస్సేన్, సారయ్య, జంగంపల్లి సత్యనా రాయణ, రవి, తదితరులుపాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్

'ముఖ్యమంత్రి వ్యాఖ్యలు సరికాదు'

శ్రీరాంపూర్, ఆగస్టు 4: ప్రైవేటు పాఠశాలలపై సీఎం చేసిన వ్యాఖ్యలు సరికాదని ట్రస్మా (టీఆర్ఎస్ఎంఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మలెత్తుల రాజేంద్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలల యజమానులు ఇంటర్, డిగ్రీ ఫెయిల్ అయిన వారిని ఉపాధ్యా యులుగా నియమించుకొని స్కూళ్లను నడుపుతున్నారని ముఖ్యమంత్రి హోదా కలిగిన వ్యక్తి వ్యాఖ్యానించడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతి యేడాది టీచర్ ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో టీటీసీ, బీఎడ్ చేసిన నిరుద్యోగులు ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5 లక్షల మంది టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు తాము ఉపాధి కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ప్రైవేటు పాఠశాలలు పోరాటం చేసిన విషయం మరువకూడదని తెలిపారు. ఉన్నతమైన పదవిలో ఉండి ప్రైవేటు పాఠశాలల గురించి అవమానకరంగా మాట్లాడడం తమను ఎంతో వేదనకు గురి చేసిందని తెలిపారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలి

- టీపీసీసీ జిల్లా కో ఆర్డినేటర్ తిరుపతి

బెల్లంపల్లి, ఆగస్టు 4: రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని టీపీసీసీ మంచిర్యాల జిల్లా కో ఆర్డినేటర్ తిరుపతి అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం టీపీసీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో పనిచేస్తున్న వారికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. సోషల్ మీడియా నాయకులు ప్రభుత్వ అభివృద్ధి పథకాలను, సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. త్వరలోనే నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం పది సంవత్సరాలుగా సోషల్ మీడియా బెల్లంపల్లి నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా సేవలందిస్తున్న ఏల్పుల రోహిత్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

చంద్రమోహన్‌గౌడ్‌కు లయన్స్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ అవార్డు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 4: యూత్ ఎక్స్చేంజ్, స్పోర్ట్స్‌లలో ఉత్తమ సేవలు అందించినందుకు 2023-24కు గానూ ఉదారి చంద్ర మోహన్‌కు లయన్స్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ అవార్డును అందజేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ డిస్ట్రిక్ట్ 320 చైర్‌పర్సన్ లయన్ తీగల మోహన్‌రావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు, పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ సునీల్‌కుమార్ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ రాజిరెడ్డి, జిల్లా గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


మంచిర్యాల జడ్పీ ఉన్నత పాఠశాల 1987-88బ్యాచ్ విద్యార్థులు


మంచిర్యాల జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల 2010-11బ్యాచ్ విద్యార్థులు


మందమర్రిలోని శ్రీరాఘవేంద్ర ఉన్నత పాఠశాల 2001-02బ్యాచ్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఏసీసీ/మందమర్రిటౌన్, ఆగస్టు 4: మరువలేనిది పాఠశాల స్మృతులని పూర్వ విద్యార్థులు రుజువు చేశారు. జ్ఞాపకాల దొంతరులు చెరిపిస్తే చెరిగిపోయేవి కావని చాటిచెప్పారు. గత స్మృతులను మనసులో పదిలపర్చుకోవాలన్న వారి ఆశలను, ఆకాంక్షలను ఎట్టకేలకు నెరవేర్చుకున్నారు. వారు చదివిన పాఠశాలల్లో ఆదివారం కలుసుకుని ఉత్సహంగా గడిపారు.

● సంక్షిప్తం..

● ఏసీసీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లో విద్యావలంటీర్లను నియమిం చాలని జాతీయ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పదోన్నతుల వల్ల పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందని, దీంతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని తెలిపారు.

- తెలంగాణ రాష్ట్ర గ్రీన్ కోర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా సైన్స్ కేంద్రంలో ఈ నెల 8న ఎన్‌జీసీ ఏకో క్లబ్ కలిగి ఉన్న 50 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులకు ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ తయారీపై శిక్షణ ఇస్తున్నట్లు డీఈవో యాదయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రతి పాఠశాల నుంచి 8,9,10వ తరగతి విద్యార్థులు ముగ్గురు చొప్పున శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

● మంచిర్యాల కలెక్టరేట్: జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆదివారం మంచిర్యాల నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం సమావేశాన్ని నిర్వహించి 317 జీవో బాధితుల సమస్యలు, మహిళ ఉద్యోగుల సమయపాలన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుమీత్, కార్యదర్శి గోవర్ధన్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

- సీపీఐ పార్టీ కార్యాలయంలో ఆది వారం జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఆధ్వర్యంలో పట్టణ నిర్మాణ మహాసభ కార్యక్రమాన్ని నిర్వహించి పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా కలీందర్ ఆలీఖాన్, సహాయకార్యదర్శిగా చాడమహేందర్‌రెడ్డి, సభ్యు లుగా కుంచాల శంకరయ్య, బియ్యాల రాజేశం, కనకల క్రిష్ణలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు దేవి పోచన్న, కోడి వెంకటేశం, యాదగిరి, రవికుమార్ పాల్గొన్నారు.

● కోటపల్లి: మండలంలోని పిన్నారం అం గన్‌వాడీ కేంద్రంలో కుళ్లిపోయిన కోడిగడ్లు పంపిణీ చేస్తుండడంపై గ్రామస్థుల ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ నుంచి కుళ్లిన కోడిగుడ్లు అంగన్‌వాడీ కేంద్రానికి చేరాయని, అధి కారులు అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

● జన్నారం: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో శనివారం రాత్రి పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఎస్సై రాజవర్ధన్ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు ఎలాంటి ఘర్షణలకు పాల్పడకుండా అందరు కలిసి మెలిసి ఉండాలన్నారు. ఏమైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.

- మండలంలోని కలమడుగు గ్రామంలో ఎస్సీ వర్గీకరణపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభి షేకం చేశారు. కార్యక్రమంలో ఎమార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

వాంకిడి, ఆగస్టు 4: మండలంలోని కనర్‌గాం నుంచి మహారాష్ట్రకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వ్యాన్‌ను ఆదివారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వ్యాన్(ఎంహెచ్34 బిజడ్ 3730)లో వాంకిడి మండలం కనర్‌గాం నుంచి మహారాష్ట్రకు అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నట్ల వచ్చిన పక్కా సమాచారం మేరకు వాంకిడి మండలంలోని టోల్‌ప్లాజా వద్ద వ్యాన్‌ను పట్టుకున్నామన్నారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా జివితి గ్రామానికి చెందిన కపుల్ శ్యాంరావు జండేకర్ ఓరియంట్ సిమెంట్ ఫ్యాక్టరీలో లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ వ్యాన్‌లో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నాడని ఆయన పేర్కొన్నారు. ఇసుకను తరలిస్తున్న వ్యాన్‌ను సీజ్ చేసి వాంకిడి పోలీసుస్టేషన్‌లో అప్పగించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.


వ్యాన్‌తో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

ఘనంగా జాముడ్ అమావాస్య

జైనూర్, ఆగస్టు 4: మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో ఆదివారం ఆషాఢ(జాముడ్) అమావాస్యను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హిందువులు నెలరోజులపాటు మద్యం, మాంసం ముట్టకూడ దని నిర్ణయించుకుని తొలిరోజు మందు, మాసం తిని షికార్లు చేశారు. అనంతరం అదేరాత్రి శావణ మాసంలో వాటికి స్వస్తి పలకాలని ప్రతిజ్ఞ బూనారు. దీంతో నేడు సోమవారం నుంచి శ్రావణమాసం ప్రారంభమైనందున మండలవాసులు భక్తిశ్రద్ధలతో ఉపవాసం, చేసుకుంటూ ప్రతిరోజు రాత్రి సమయాల్లో భజన సంకీర్తనలు చేస్తుండటం ఆనవాయితీగా వస్తోంది. దీంతో వారు శ్రావణ మాసం పూర్తయ్యేవరకు మాంసం, మద్యానికి దూరంగా ఉంటారు. సోమవారం నుంచి కఠోరనియమాలు, భక్తిశ్రద్ధలతో మండలవాసులు భక్తిమార్గంలో పయనిస్తారని మహరాజ్ కులకర్ణి తెలిపారు.

నేటి నుంచి స్వచ్ఛదనం..పచ్చదనం

ఆసిఫాబాద్, ఆగస్టు 4: నేటినుంచి ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించను న్నట్లు ఆసిఫాబాద్ మున్సిపల్‌కమిషనర్ భుజంగరావు ఒక ప్రకటనలో తెలిపారు. నేడు మున్సిపాలిటీపరిధిలోని ఆర్‌ఆర్‌కాలనీలో ప్రారంభించనున్నట్లు ఈనెల9వరకు అన్నికాలనీల్లో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

వాంకిడి: గ్రామాలు, పట్టణాల్లో సోమవారం నుంచి ఈ నెల9 వరకు స్వచ్ఛదనం, పచ్చదనం పేరిట అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించనుంది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా అధికారులు మొక్కల పెంపకం, పారిశుధ్య చర్యలు చేపట్టనున్నారు.

● 5న చేపట్టాల్సిన పనులు..

- గ్రామాలు, పట్టణాల్లో స్థానిక నాయకులు, మహిళా సంఘాలు, యువతతో అవగాహనర్యాలీలు నిర్వహించాలి.
- ఇళ్లలోని చెత్తనుసేకరించి కంపోస్టు ఎరువులు తయారు చేయాలి.
- సారిశుధ్యం, మొక్కల పెంపకం, సీజనల్ వ్యాధులపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించాలి.
- ప్రభుత్వ కార్యాలయాలు, ప్రదేశాలను శుభ్రపర్చాలి.
- చెత్తసేకరణ వాహనాలకు జీపీఎస్‌ట్రాకింగ్ సిస్టం అమర్చాలి.
- మరుగుదొడ్లులేని వారికి వాటిని మంజూరు చేయాలి.

● 6న చేపట్టాల్సిన పనులు...

- తాగునీటి వనరులను శుభ్రపర్చాలి. రోజు క్లోరినేషన్ నిర్వహించేలా చేతన్యపరచాలి. క్లోరినేషన్‌కిట్లను అందు బాటులో ఉంచాలి.
- ఇంకుడుగుంతలు లేని ఇళ్లవద్ద వాటిని నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలి.
- తాగునీటి చెరువులు, కుంటలు కలుషితం కాకుండా స్థానికులకు అవగాహన కల్పించాలి.

● 7న చేపట్టాల్సిన పనులు..

- మురుగుకాల్వల్లో పూడిక తొలగించాలి. వర్షం, మురుగునీరు నిలవకుండా డ్రెయినేజీలోకి మళ్లించాలి
- ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి. స్థానికరోడ్లపై గుంతలను మట్టితోపూడ్చి రోలింగ్ చేయాలి.
- తాగునీటి చేతిపంపులు, పైప్‌లైన్ల వద్ద మురుగునీరు నిలవకుండా చూసుకోవాలి.

● 8న చేపట్టాల్సిన పనులు..

- వైద్యారోగ్యశాల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి సీజనల్‌వ్యాధులు, డెంగీ,మలేరియావంటి వాటిపై అవగాహన కల్పించాలి. గ్రామాల్లో జ్వరసర్వే నిర్వహించాలి. ప్రజలు తరుచూజ్వరం బారినపడుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.
- నీరు నిల్వ ఉన్నచోట అయిల్ బాల్స్ వినియోగించాలి.
- ఎనిమల్ బర్త్‌కంట్రోల్(ఏబీసీ) సెంటర్లు ఏర్పాటు చేయాలి. వీధికుక్కలను గ్రామకార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లు వాటిని ఏబీసీ కేంద్రాలకు తరలించాలి.

● 9న చేపట్టాల్సాన పనులు..

- మంగళ, శుక్రవారాలను డ్రై డేలుగా పాటించాలి.
- శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించాలి.
- రోడ్ల పక్కన ఎండిపోయిన చెట్లను తీసేయాలి.

ఎప్పటికప్పుడు నివేదికలు అందజేత...

స్వచ్ఛదనం...పచ్చదనం కార్యక్రమాలపై కలెక్టర్లు సమీక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా అధికారులను అప్రమత్తం చేయాలి. పంచాయతీకార్యదర్శి, ఆశాకార్యకర్త, మరోముగ్గురు అధికారులతో కూడినబృందం గ్రామస్థాయిలో కార్యక్రమం అమలుకు బాధ్యతవహించాలి. నివేదికను పంచాయతీ ప్రత్యేకాధికారి, జిల్లాఅధికారులకు పంపించాలి. పట్టణస్థాయిలో చేపట్టే కార్యక్రమాల నివేదికలను కలెక్టర్‌కు ప్రత్యేకాధికారి, వార్డు అధికారులు అందించాలి.

ప్రకృతి అందాలకు నెలవు భూసిమెట్ట అడవులు


భూసిమెట్ట ఘాట్‌లో దట్టమైన అడవీ ప్రాంతం

జైనూర్, ఆగస్టు 4: జైనూరు మండల పరిధిలో గల భూసిమెట్ట అడవులు ప్రకృతిఅందాలకు నిలువు దట్టంగా ఉన్నాయి. ప్రకృతి రమణీయతను ఆస్వాలదించాలనుకునే పర్యాటకులకు భూసిమెట్ట ఘాట్ అడవులు స్వర్గధామం. పచ్చనిఅడవి, పక్షుల కిలకిల రావాలు, ఆకర్షణీయమైన జలపాతాలు, వన్య మృగాలు కలబోసుకొని ఈ ప్రాంతం పర్యాటకులను ఆకిర్షిస్తుంది. వృక్షాల సౌందర్యం మనస్సును ఆకర్షించే విధంగా ఉంటుంది.

జలపాతాలు: భూసిమెట్ట ఘాట్ ప్రాంతంలోని జలపాతాలు కనువిందు చేస్తాయి. ఎత్తైన ప్రదేశం నుండి జాలువారే నీళ్లలోతైన గుండంలో పడుతుండడం ఎంతో అద్భుతంగా ఉంటుంది. జాలు వారుతున్న నీళ్ల దృశ్యాలు చూసినప్పుడు ఆనందంతో మురిసి పోవడం ఖాయమని జల పాతం పరివాహకప్రాంత అడ్డెసర వాసులు పేర్కొంటున్నారు.

మూలమలుపుల రోడ్డు: జిల్లా కేంద్రం నుంచి ఆదిలాబాద్‌కు రాకపోకలు నిర్వహిస్తున్న భూసిమెట్ట ఘాట్ అడవిలోని రోడ్డు అదొక కొత్త అనుభూతినిస్తుంది. సుమారు 30నుంచి 40మీటర్ల పొడవైన రోడ్డుమార్గం.. గుట్టలు, కొండలు, దట్టమైన అడవుల మధ్య సాగుతుంది. ఈ మూలమలుపుల రోడ్డుపై ప్రయాణించడంతో అదో తీపి జ్ఞాపకంగా గుర్తుండిపోతుంది. ఈ మార్గంలో అనేక వింతైన దృశ్యాలు ప్రయాణికులను కనువిందు చేస్తాయి.

అటవీశాఖ బంగ్లా: దట్టమైనఅటవీ ప్రాంతంలో అడవి సంరక్షణకు, పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన బంగ్లా ప్రస్తుతం అధ్వానంగా తయారైంది. వర్షం పడితే బంగ్లా ఊరుస్తుంది. ప్రతి ఆదివారం బంగ్లావద్దకు మంచిర్యాల, పెద్దపెల్లి, నిర్మల్, తదితర ప్రాంతాలనుంచి పర్యాటకులు వస్తుంటారు. విద్యార్థులు కూడా ఇక్కడి దృశ్యాలను తిలకించేందుకు సెలవు రోజుల్లో ఉపాధ్యాయులు తీసుకొస్తుంటారు.



ఘాట్‌లో మూలమలుపుల రోడ్డు, మరమ్మతుకు నోచుకోని అటవీశాఖ బంగ్లా

మార్లవాయిలో నెట్‌వర్క్ ఇబ్బందులు

● సెల్ టవర్‌పై దృష్టిసారించని అధికారులు
● సిగ్నల్స్ అందక పనిచేయని రేషన్ స్కానింగ్
● రేషన్ కోసం గ్రామస్థులు వేరే ఊరికి

జైనూర్, ఆగస్టు 4: ఆ ఊరి ఆదివాసులు రేషన్ బియ్యం, పింఛన్ల కోసం మరోఊరికి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆ ఊరు మరేదో కాదు.. మానవ పరిణామ శాస్త్రవేత్త హైమన్ డార్ఫ్, ఆయన సతీమణి బెట్టి ఎలిజిబెత్ నివసించిన మండలంలోని చారిత్రాత్మక గ్రామమైన మార్లవాయి. ఈ ఊర్లో 5వందలకు పైగా జనాభా ఉండగా 150మంది రేషన్‌కార్డు లబ్ధి దారులున్నారు. అదేవిధంగా సుమారు 14మంది ఆసరా, వితంతు పింఛన్ దారులున్నారు. లబ్ధిదారులకు గ్రామంలోనే నిత్యావసర సరకులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. కానీ మార్లవాయిలో సెల్‌ఫోన్ నెట్‌వర్క్ లేనందున వారు పింఛన్ పొందాలన్న, నిత్యావసర సరకులు తీసుకుందామన్న గ్రామం దాటి సిర్పూర్(యు) మండలంలోని రాఘాపూర్ పరిసర ప్రాంతానికి వెళ్లాల్సిందే.

తమ గ్రామానికి సంవత్సరానికి రెండుమూడు సార్లు మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ, ఎస్పీ, కలెక్టర్లు రాకపోకలు చేస్తుంటారు. కానీ ఇక్కడ సెల్‌టవర్ పనులు పూర్తి చేసి నెట్‌వర్క్ అందించలేకపోతున్నారని ఆదివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా వెంటనే మార్లవాయిలో నెట్‌వర్క్ సదుపాయం కల్పించాలని వారు కోరుతున్నారు.


నిత్యావసర సరకులు, పింఛన్ కోసం ఊరు వదిలి వచ్చిన ఆదివాసులు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం జిల్లా వార్తలు
8
సోమవారం 5 ఆగస్టు 2024



కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి

కాగజ్‌నగర్, ఆగస్టు 4:కాగజ్‌నగర్ కడంబా భీమన్న అటవీప్రాంత సమీపంలో ఆదివారం కుక్కలదాడిలో చుక్కల దుప్పి మృతిచెందినట్టు ఎఫ్ఆర్వో రమాదేవి తెలిపారు. భీమన్న అటవీప్రాంతంలో సాయంత్రం కుక్కలు వెంబడించి చుక్కలదుప్పిని గాయపర్చినట్టు తెలిపారు. విషయం తెలియగానే సిబ్బంది వెళ్లి చికిత్సలు అందించే ప్రయత్నం చేయగా అప్పటికే రక్తస్రావంతో మృతిచెందినట్టు వివరించారు.



మృతిచెందిన దుప్పి

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్, ఆగస్టు 4: ఈ నెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని గిరిజనసంఘాల నాయకులు కోరారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలన్నారు. సమావేశంలో గిరిజనసంఘం నాయకుడు సోయం చిన్నయ్య, ఆదివాసీసంఘం నాయకులు లక్ష్మయ్య, ఉపేందర్ వెంకటేశ్వర్లు, రిటైర్డ్‌ఎంప్లాయీస్ యూనియన్‌అధ్యక్షుడు జయదేవ్, అంబాల ఓదెలు, అల్లి రాజయ్య, బీఆర్ఎస్ సిర్పూరు తాలుకా కన్వీనర్ లెండుగురే శ్యాం రావు పాల్గొన్నారు.

పాతవారిని విధుల్లోకి తీసుకోవాలి

కాగజ్‌నగర్, ఆగస్టు 3: ఎయిడ్స్ ప్రాజెక్టులో పాతవారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, కులం పేరుతోదూషించిన వారిపైవెంటనే ఎస్సీఎస్టీ కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు జెల్లంపల్లి శ్రీనివాస్, కంబాల రమేష్ డిమాండు చేశారు. ఆదివారం స్థానికంగా వారు మాట్లాడారు. కాగజ్‌నగర్‌లోని సాయిమహిళా మండలి ఎయిడ్స్ ప్రాజెక్టు పలుకారణాలతో ఇతరులకు అప్పజెప్పగా అందులో పని చేసిన సిబ్బందిని కాదని ఇతరులను విధుల్లోకి తీసుకోవటంపై మండిపడ్డారు. అలాగేపాతసిబ్బందిని కులంపేరుతో దూషిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని డిమాండు చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి చీపెల్లి రాజయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

రెబ్బెన, ఆగస్టు 4: రెబ్బెన ఇందిరానగర్‌లోని శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో ఆదివారం భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. ఈ సందర్భంగా అమ్మ వారికి ఓడి బియ్యం పోశారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దర్శనానికి వచ్చిన భక్తులు

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఫలితాల్లో ప్రతిభ

రెబ్బెన, ఆగస్టు 4: రెబ్బెన గోలేటి గ్రామ గౌతంనగర్‌కు చెందిన సోమయ్య-పార్వతి దంపతుల కుమారుడు రాజ్‌కుమార్ అసిస్టెంట్ఎగ్జిక్యూటివ్ఇంజనీర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. ఇరిగేషన్ విభాగంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఎన్నికయ్యారు. రాజ్‌కుమార్ ఇప్పటికే ఆసిఫాబాద్‌లోని హెడ్‌క్వార్టర్స్‌లో స్పెషల్‌పార్టీలో విధులు నిర్వహిస్తున్నారు.



రాజ్‌కుమార్

సిర్పూర్(టి): మండలకేంద్రానికి చెందిన రాజ్‌కుమార్ మిషన్‌భగీరథలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎంపికయ్యాడు. టీపీబీవో, పీఎల్‌డీవీ ఎంపికకు కూడా షార్ట్‌లిస్టు అయ్యాడు. ప్రస్తుతం ఆయన పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు(ఎంటీఈఎఫ్‌సీసీ) చెందిన కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సెంట్రల్‌పొల్యూషన్ కంట్రోల్ బోర్డు)లో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నాడు.



రాజ్‌కుమార్

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

కాగజ్‌నగర్, ఆగస్టు 4: కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు రేగుంట కేశవ్‌రావు మాదిగ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పుతో దీర్ఘకాలిక సమస్యకు తెరపడిందన్నారు. ఈ పోరాట విజయం ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగకు దక్కుతుందన్నారు. అనంతరం ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడికి పాలభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్రక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు జెల్లంపల్లి శ్రీనివాస్, కంబాల రమేష్, నక్క మనోహర్, శ్రీనివాస్‌తో పాటు జిల్లా నాయకులు, రాష్ట్ర సభ్యులు, దళిత సంఘం వ్యవస్థాపకులు ఈర్లసునీల్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రాలు

● భయం గుప్పిట్లో విద్యార్థులు

సిర్పూర్(టి), ఆగస్టు 4: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అధికశాతం అంగన్‌వాడీ కేంద్రాలు ప్రభుత్వ పాఠశాల భవనాల్లో కొనసాగుతుండగా రైల్వేస్టేషన్ అంగన్‌వాడీ కేంద్రంభవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు స్లాబ్ పైనుంచి నీరు ఊరుస్తున్నది. దీంతో పిల్లలు, తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. అలాగే లోనవెల్లి అంగన్‌వాడీ కేంద్రం పైస్లాబ్ పెచ్చులు పడిపోవడంతో ఆ కేంద్రంలోని అంగన్‌వాడీటీచర్, ఆయా, పిల్లలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీకేంద్రాలకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



పెచ్చులూడిన అంగన్‌వాడీ భవనం



'గ్రాట్యూటీ సర్వీస్‌పే డబ్బులు విడుదల చేయాలి'

జైపూర్, ఆగస్టు 4: పవర్‌ప్లాంట్ మెయింటనెన్స్ చేసిన స్టాగ్ కంపెనీ నుంచి కార్మికులకు రావాల్సిన గ్రాట్యూటీ సర్వీస్‌పే డబ్బులు విడుదల చేయాలని హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రెటరీ విక్రమ్‌కుమార్, వైస్‌ప్రెసిడెంట్ సాయికృష్ణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలకేంద్రంలో వారు మాట్లాడారు. గత రెండు సంవత్సరాల నుంచి హెచ్‌ఎంఎస్ యూనియన్ తరుపున సింగరేణి అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ఇప్పటివరకు రావాల్సిన డబ్బుల రాకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సింగరేణి తరుపున కాంట్రాక్టు ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు వెంటనే డ్రెస్‌లు, బూట్లుఅందజేయాలని డిమాండ్‌చేశారు.సమావేశంలో నాయకులు చిప్పకుర్తి సంపత్, శ్రీధర్, రమేష్, అజర్, నవీన్, అంజి పాల్గొన్నారు.

సౌకర్యాలు లేని వసతిగృహాలు

● విద్యార్థుల ఇబ్బందులు
● పట్టించుకోని అధికారులు
● శిథిలావస్థలో గదులు



కాగజ్‌నగర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాల

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 4: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ సాంఘికసంక్షేమ, వెనుకబడిన తరగతుల, గిరిజనసంక్షేమ, పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల్లో వసతులు కరువవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వందలాది మంది పేద విద్యార్థులు బస చేసి చదువుకుంటున్న హాస్టళ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సమస్యలు చూస్తున్న సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. చేపట్టిన మరమ్మతు పనులు కూడా ఇష్టారాజ్యంగా చేసినట్లు ఆరోపణలున్నాయి. కొన్ని చోట్ల సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లోనే హాస్టళ్లు కొనసాగుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలు విద్యార్థులకు మరింత శాపంగా మారాయి. దిక్కుతోచని పరిస్థితుల్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు.

అద్దె భవనాలే దిక్కు.

దశాబ్దాలుగా కొన్ని వసతిగృహాలు ఇంకా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. జిల్లాలోని కాగజ్‌నగర్ డివిజన్‌లోని 7మండలాల్లో సుమారు 40పైగా వసతి గృహాలున్నాయి. వీటిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, పోస్టు మెట్రిక్‌తోపాటు ఎంజేపీ, మైనారిటీ తదితర రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలున్నాయి. వేలాది మంది విద్యార్థులుండే హాస్టల్లు సరైన సౌకర్యాలు లేక పోవడంతో అవస్థలు తప్పడం లేదు. పలు హాస్టళ్లలో వర్షాకాలం వచ్చిందంటే పైకప్పులు ఊరుస్తున్నాయి.

కొన్నిచోట్ల తరగతి గదులు పెచ్చులూడి పడుతున్నాయి. స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలతో పాటు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో గదుల్లో కనీసం కిటికీలకు తలుపులులేని పరిస్థితి దాపురించింది. దశాబ్దాల కిందట నిర్మించిన భవనాలు కావటంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రమాదకర పరిస్థితిలో ఉండే హాస్టల్ గదుల్లోనే విద్యార్థులు బస చేస్తున్నారు. పలు చోట్ల మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. ముక్కు మూసు కొని మూత్రశాలలు, మరుగుదొడ్లకు వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. గతంలో మరమ్మతులు చేసినప్పటికీ పలుచోట్ల యథావిధిగానే సమస్యలున్నాయని పేర్కొంటున్నారు. ఇలాగే ఒక్కో మండలంలో 5కు పైగా హాస్టళ్లు ఉన్నాయి. అన్ని హాస్టళ్లలో అరకొర వసతులే ఉన్నట్లు విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పేర్కొంటున్నారు.



కిటికీలకు కట్టిన పరదాలు



పెచ్చులూడుతున్న ఆశ్రమ పాఠశాల తరగతి గది

భారీ వర్షాలతో మరింత సమస్య..

కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని హాస్టళ్లలో గదులు ఊరుస్తున్నాయి. కొన్ని చోట్ల హాస్టళ్ల ముందు సరైన రోడ్డు లేకపోవడంతో బురదలో నుంచే విద్యార్థులు, తల్లిదండ్రులు నడిచి వెళుతున్నారు. మరికొన్ని చోట్ల మురికినీరు, వరద నీరు నిలిచి దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయని పేర్కొంటున్నారు. కిటికీలకు తలుపులు లేకపోవడంతో రేకు ముక్కలు, సంచులు అడ్డుపెట్టుకొని విద్యార్థులు కాలం వెల్లదీస్తున్నారు. పలు హాస్టళ్లలో చుట్టూ నీరు నిలిచి పోయింది. ఒక్కో హాస్టల్‌లో 50 నుంచి 100 మందికి పైగా విద్యార్థులున్నారు. వీరికి సరిపడా సౌకర్యాలు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కాగజ్‌నగర్‌లో బీసీ బాలురు, బాలికలు, ఎస్టీ ఆశ్రమ, పోస్ట్ మెట్రిక్, ఎస్సీ తదితర 7 హాస్టళ్లు ఉన్నాయి. పట్టణ ప్రాంతం అయినా ఇక్కడే 7హాస్టళ్లకు కేవలం ఐదింటికి మాత్రమే పక్కా భవనాలుండగా, దశాబ్దాలుగా మిగిలిన 2 హాస్టళ్లు అద్దెగదుల్లో కొనసాగుతున్నాయి. ఆయా హాస్టళ్లలో అరకొర వసతుల మధ్యనే విద్యార్థులు కాలం వెల్లదీయాల్సిన పరిస్థితి ఉంది. జిల్లాలోని మిగితా ప్రాంతాల్లోని హాస్టళ్లలో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి.



బురదమయంగా హాస్టల్ దారి

ప్రభుత్వం దృష్టికి అనేక సమస్యలు తీసుకుపోయా: ఎమ్మెల్యే

కౌటాల, ఆగస్టు 4: అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గంలో నెలకొన్న అనేక సమస్యలను ప్రస్తావించానని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీల భర్తీ చేయాలని, మెడికల్ కాలేజీలో సిబ్బందిని నియమించాలని ప్రస్తావించినట్లు పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టుకు బడ్జెట్‌లో కేటాయించిన రూ.250కోట్లు ఏ మూలకు సరిపోవని తెలియజేశానన్నారు. సిర్పూర్ నియోజకవర్గ ప్రతినిధిగా అసెంబ్లీలో గళం విప్పే అవకాశం కల్పించిన నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వానుపటేల్, రాజేందర్‌గౌడ్, మల్లయ్య, భీమన్న, తుకారాం, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

ఆగి ఉన్న బైక్‌ను ఢీకొన్న మరో బైక్

● ఒకరు మృతి, మరొకరికి గాయాలు

దహెగాం, ఆగస్టు 4: ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన మండల కేంద్రం సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుంచవెల్లి గ్రామానికి చెందిన చిప్ప సూరజ్, చౌదరి నవీన్ కలిసి కాగజ్‌నగర్ పట్టణానికివెళ్లి ఎలక్ట్రికల్ సామగ్రి కొనుగోలుచేసి తిరిగి వస్తున్నారు. దహెగాం మండలకేంద్ర సమీపంలోగల మల్లన్న ఒర్రె సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాల మధ్యలో మూలమలుపు వద్ద వారు ఆగి ఉన్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వాహనం వెనుక కూర్చున్న నవీన్ తలకు బయలమైన గాయమైంది. వాహనం నడుపుతున్న సూరజ్ వెన్నెముకకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని 108లో వారిని కాగజ్‌నగర్ పట్టణానికి తరలించగా చికిత్స పొందుతూ నవీన్ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సంఘటన స్థలంలో క్షతగాత్రులు

ఘనంగా కంకాలమ్మ బోనాలు

కౌటాల, ఆగస్టు 4: మండలంలో ఆదివారం ఘనంగా కంకాలమ్మ బోనాల పండగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని సదాశివపేట చౌరస్తా నుంచి కంకాలమ్మ ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించి బోనాలు సమర్పించారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.



బోనాలతో నృత్యాలు చేస్తున్న శివసత్తులు

'స్వచ్ఛదనం- పచ్చదనం'ను విజయవంతం చేయాలి'

సిర్పూర్(టి), ఆగస్టు 4: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. మండలంలో ప్రత్యేకాధికారిగా డీఎల్‌పీవో సురేష్ బదిలీకాగా ఆయన స్థానంలో ఎంపీడీవో సత్యనారాయణను కలెక్టర్ మండల ప్రత్యేకాధికారిగా నియమించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

నిలిచిపోయిన భారీవాహనాలు

సిర్పూర్(టి), ఆగస్టు 4: మండలసమీపంలోని పోడ్సా రహదారిపై భారీవాహనాలు ఇరుక్కుపోవడంతో మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్‌కు వెళ్లే వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు.

'ఆదివాసులకు సేవలందిస్తా'

జైనూర్, ఆగస్టు 4: దేశంలోని గోండ్వాన సమాజానికి అన్యాయం జరగకుండా విశ్వసనీయతతో సేవలందిస్తామని అఖిలభారత గోండ్వానమహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్నాక భీంరావ్ అన్నారు. డిల్లీలో జరిగిన అఖిల భారతగోండ్వాన మహాసభలో ఆయనపాల్గొన్నారు. అనంతరం మండలకేంద్రంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతరపున తనను గోండ్వాన మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారన్నారు.

మరమ్మతులు చేసి.. ప్రయాణం సాగించి

పెంచికలపేట, ఆగస్టు 4: మండలంలోని గిరిజన గ్రామాలైన మురళీగూడ, జిల్లెడగ్రామాల ప్రజలు రోడ్డు మార్గం సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు ప్రధానరోడ్డు తీవ్రంగా దెబ్బతింది. ఆదివారం బెజ్జూరు వారసంతకు వివిధఅవసరాల నిమిత్తం వెళ్తున్న క్రమంలో మండలవాసులు రోడ్డుపై ఏర్పడిన గుంతలను రాళ్లతో నింపుతూ ప్రయాణం సాగించారు. రోడ్డుకు కనీసమరమ్మతులైనా నిర్వహించాలని గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మరమ్మతులు చేసుకుంటూ వెళ్తున్న గ్రామస్థులు

బురదమయంగా ఆసుపత్రి రోడ్డు

● అవస్థలు పడుతున్న రోగులు

బెజ్జూరు, ఆగస్టు 4: ఇటీవల కురిసిన వర్షాలకు మండలకేంద్రంలోని ఆసుపత్రికి వెళ్లే రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో ఆసుపత్రికి వెళ్లే రోగులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రికి వెళ్లేదారిలో ఎప్పుడోవేసిన రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. వర్షపునీరు చేరడంతో రోడ్డంతా బురదమయంగా తయారైంది. ఆసుపత్రి కోసం వివిధ గ్రామాలనుంచి నిత్యం వందలాదిమంది రోగులు వైద్యంకోసం వస్తుంటారు. రోగులను తీసుకుని 108వాహనం సైతం నిత్యం రాకపోకలు చేస్తుంటుంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా బురదమయంగా మారడంతో కనీసం ద్విచక్రవాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఆసుపత్రికి వెళ్లాలంటేనే భయం కలుగుతోందని వివిధ గ్రామాలకు చెందిన రోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆసుపత్రికి వెళ్లే దారికి పక్కా రోడ్డు ఏర్పాటుచేయాలని మండలవాసులు కోరుతు న్నారు.



బురదతో అధ్వానంగా ఆసుపత్రి రోడ్డు

గ్రామస్థుల శ్రమదానం

బెజ్జూరు, ఆగస్టు 4: ఇటీవల కురిసిన భారీవర్షాలకు ప్రాణహితనది బ్యాక్‌వాటర్‌తో పాపన్నపేట- తలాయి గ్రామాల మధ్య రోడ్డుపూర్తిగా అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో ఆదివారం మాజీఎంపీటీసీ శ్రీనివాస్, పీఏసీఎస్ మాజీవైస్ చైర్మన్ ఇస్తారి ఆధ్వర్యంలో తిక్కపల్లి గ్రామస్థులు శ్రమదానంతో రోడ్డును బాగుచేసుకున్నారు. గ్రామస్తులంతా చందాలు వేసుకొని ట్రాక్టర్‌తో మొరం పోసి చదును చేశారు. దీంతో పలు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శ్రమదానం చేసున్న గ్రామస్థులు

పత్తిలో కలుపు, తెగుళ్ల బెడద

● వరుస వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం ● ఆందోళనలో రైతాంగం



బెజ్జూరు: అధిక వర్షాలకు పత్తి పంటలో నిల్వ ఉన్న నీరు (ఫైల్)

బెజ్జూరు/కెరమెరి, ఆగస్టు 4: రాష్ట్రంలో పత్తి అధికంగా పండించే జిల్లాలో కుమరం భీం ఆసిఫాబాద్ కూడా ఒకటి. ఈసీజన్‌లో జిల్లాలో సుమారు 3.50 లక్షల ఎకరాల్లో పత్తిసాగు చేశారు. జిల్లాలో కురిసే వర్షాలు పంటలకు మేలు కలిగిస్తున్నా సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదు అవుతుండటంతో తెగుళ్ల బెడద అంటుకుంది. ప్రాణహిత నది పరివాహక ప్రాంతాల్లో పత్తిసాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోగా ఉన్న పంటలకు తెగుళ్లు సోకుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

భయపెడుతున్న కలుపు

వర్షాలకు పత్తిలో కలుపు విపరీతంగా మొలిచి రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. రైతులందరి చేనులలో ఇదే పరిస్థితి ఉండడంతో కలుపు తీతకు మహిళా కూలీలకు డిమాండ్ పెరిగింది. మండల వ్యాప్తంగా 8194మంది రైతులు 29,405ఎకరాల్లో పత్తిసాగు చేస్తున్నారు. కలుపు తీసేందుకు ఒకఎకరానికి రూ.5 నుంచి రూ.7వేల వరకు కూలీలు డిమాండ్ చేస్తున్నారు. రోజువారి కూలి రూ.300 నుంచి రూ.400వరకు అడుగుతున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టి పత్తిసాళ్ల మధ్య డౌర నడిచినట్లయితే ఇంత డిమాండ్ ఉండదని రైతులు పేర్కొంటున్నారు. దీంతో చేసేదేమీ లేక కొందరు రైతులు గడ్డిమందు కొట్టేందుకు మొగ్గుచూపుతు న్నారు.



కెరమెరి:పత్తి పంటలో పెరిగిన కలుపు

కలుపు తర్వాత తెగుళ్ల నియంత్రణకు మందులు పిచికారి చేయాల్సి వస్తోంది. వర్షపునీరు నిల్వఉన్న ప్రాంతంలో వేరుకుళ్లు తెగులు సోకి మొక్క క్రమంగా వడలి పోతోంది. తేమవల్ల రసంపీల్చే పురుగుల ఉధృతి ఎక్కువైంది. మునుపటిలాగే ఈఏడాది పిండినల్లి కూడా పంటపె కనిపిస్తోంది. ఫలితంగా పురుగుమందుల పిచికారితో పెట్టుబడులు ఇంకా పెరిగేఅవకాశం ఉంది.

సస్యరక్షణ ముఖ్యం..

- రాజులనాయుడు, వ్యవసాయ అధికారి, బెజ్జూరు

వర్షాలతో అధిక తేమ నేపథ్యంలో పత్తి చేలల్లో నీరునిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వేరుకుళ్లు ఆశించినట్లయితే వర్షాలు తగ్గాక లీటరు నీటికి 1.5గ్రాముల ఎసిఫేట్ 75ఎస్పీ, లేదా 2.5మి.లీ పిప్రోనిల్ మందును పిచికారి చేయాలి. పొగాకు లద్దె పురుగు ఆశించే అవకాశం కూడా ఉంది. దీని నివారణకు 1.5గ్రాముల ఎసిఫేట్, లేదా2.5మి.లీ. క్లోరోపైరిపాస్ పిచికారి చేయవచ్చు. చెట్లు ఎండిపోతున్నట్లు గమనిస్తే లీటరు నీటిలో 3గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, లేదా 1గ్రాము కార్బండిజమ్‌ను కలిపి మొక్క మొదళ్ల తడిచేలా పోయాలి. ఆకాశం మేఘావృతమైన సమయాల్లో ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగుళు వ్యాపిస్తుంది. 2.5గ్రాముల కార్బండజిమ్, మాంకోజెట్‌ను లీటరు నీటిలో కలిపి 5-7రోజుల వ్యవధిలో రెండుసార్లు మొక్కల అడుగు భాగం తడిచేలా పోయాలి. మరిన్ని సలహాల కోసం రైతు వేదికలో అందుబాటులో ఉండే వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలి.

కూలీల రేట్లు పెరిగాయి..

- సిడాం భీము, రైతు, భీమన్‌గొంది, కెరమెరి

నెల రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పత్తిలో కలుపు పెరిగింది. కలుపు తీయడానికి ఎకరానికి రూ.4 నుంచి రూ.7వేల వరకు ఖర్చుఅవుతుంది. మహిళాకూలీలు రోజుకు రూ.300 నుంచి రూ.400డిమాండ్ చేస్తున్నారు.

